యూత్ ఫెస్టివల్‌లో 'శ్రీనివాస' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - కాట్రేనికోన


ప్రియాంకను అభినందిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

చెయ్యరు శ్రీనివాసా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల్లో సిఎస్ఇ విభాగానికి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎమ్.ప్రియాంక అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్-24 లో 3డి ప్రింటింగ్ అంశంపై జరిగిన ఉపన్యాస విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ కుమార్ శనివారంతెలిపారు. కళాశాల్లో జరిగిన అభినందన సభలో విద్యార్థినిని సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ, పాలకవర్గ సభ్యులు సందీప్, కళాశాల విద్యాశాధి కారిని డాక్టర్ఎస్.జయలక్ష్మి తదితరులు అభినందించారు.

దడ పుట్టిస్తున్న డిజె

- శృతి మించుతున్న శబ్దాలు
- వేడుకలు, ఫంక్షన్లలో తప్పనిసరిగా మారిన డిజె
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారులు
- బెంబేలెత్తున్న ప్రజలు

ఈ రోజుల్లో వేడుక ఏదైనా డిజె ఉండాల్సిందే..! గుండెలు దద్దరిల్లే సౌండ్‌తో కుర్రకారు ఊగాల్సిందే..! అయితే ఈ డీజే సౌండ్ దెబ్బకు గుండెలు ఆగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మొన్నా మధ్య.. బిహార్‌లో డిజె దెబ్బకు వరుడు పెళ్లి మండపంలోనే ప్రాణాలు విడవగా.. తాజాగా అమలాపురం పట్టణం కొంకాపల్లిలో చెడీతా లింఖానా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజె ఏర్పాటు చేసిన డిజె వద్ద డ్యాన్స్ చేస్తున్న అమలాపురం రూరల్ మండలం బం డారులంక గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడు మృతి చెందాడు.

ప్రజాశక్తి - రాజోలు

డిజె(డిస్కజాకీ), టపాసుల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ప్రతి ఏడాది శృతిమించుతూ ప్రజల ప్రాణాలమీదకొస్తున్నా డిజెల శబ్దాలను కట్టడి చేయాలని అధికారులు భావించడం తప్ప ఆచరణలో విఫలమవుతున్నారు. కేవలం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగానే కాకుండా మతపరమైన ర్యాలీలు, వేడుకల్లో ఎక్కువగా డిజెలను వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా దసరా ఉత్సవాల్లో డిజెలు హడలెత్తిస్తున్నాయి. దుర్గామాత, వినాయక విగ్రహాల ఆగమన, శోభాయాత్రల్లో డిజేలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో శబ్ద కాలుష్య తీవ్రత పెరిగిపోతోంది. సాధారణంగా ఆరోగ్యవంతులు 45 నుంచి 55 డెసిబుల్స్ శబ్దాన్ని భరించగలరు. అంతకుమించి శబ్దం వింటే మానసిక ఆందోళన, అధిక రక్తపోటు, గుండెలయలో తేడా, నాడీ మండలంపై ఒత్తిడి వంటి సమస్యలు మొదలవుతాయని వైద్యాధికారులు చెబుతున్నారు. డిజెల వల్ల 100 నుంచి 140 డెసిబుల్స్ శబ్దం ఉత్పన్నమవుతుంది. దీనికి సమీపంలో గంట నుంచి రెండు గంటల వరకు ఉన్న వారు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. అప్పటికప్పుడు అవి బయటపడక పోయినా తర్వాత తీవ్ర సమస్యగా మారుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



మితిమీరిన శబ్ద కాలుష్యం హానికరం



అధిక శబ్దాలను వెదజల్లే డిజె మోతలతో మానవ, జంతు ఆరోగ్యాలపై దుష్ప్రభావం కలుగుతుంది. డిజె శబ్దాలకు గుండె పోటుకు, చెవి పోటుకు గురయ్యే ప్రమాదం ఉంది. గుండె వేగంగా కొట్టు కోవడంతోపాటు మెదడుపై తీవ్ర ప్రభావం చూపడం, స్ట్రోక్‌లు, మానసిక కల్లోలం, భయం, ఆందోళనలు కలుగుతాయి. అనేక రకాల అనారోగ్యాలకు దారి తీస్తుంది. కేవలం మానవులకే కాదు డిజె మోతలు వన్య ప్రాణులు, సాధు జంతువులుకూడా తీవ్ర అనారోగ్యానికి కారణం అవుతాయి. డిజెలపై నిషేధం విధించి అధిక శబ్దాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ రాపాక రమేష్ బాబు, వైద్య నిపుణులు

శబ్ద కాలుష్యాలుగా మండల కేంద్రాలు

కోనసీమలో అమలాపురం, రాజోలు, తాటిపాక, మలికిపురం, రావులపాలెం, రామచంద్రపురం, మండపేట వంటి ముఖ్య మండలాలు శబ్ద కాలుష్య కేంద్రాలుగా మారుతున్నాయి. శబ్ద తీవ్రతను కొలవడానికి డెసిబుల్ (డిబి) అనే ప్రమాణాలను వినియోగిస్తారు. నివాస ప్రాంతాల్లో సాధారణంగా 50 డిబిల శబ్ద స్థాయి ఉంటుంది. ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం.. 65 డెసిబుల్స్ శబ్దస్థాయి దాటితే శబ్ద కాలుష్యానికి దారిస్తుంది. శబ్ద తీవ్రత 85 డెసిబుల్స్ దాటితే హానికారక ప్రతికూల ప్రభావాన్ని చూపుతూ శబ్ద కాలుష్యానికి కారణమవుతోంది. దీర్ఘకాలంపాటు శబ్ద కాలుష్యం ప్రాంతాల్లో జీవించిన మానవులు, జంతువులు వినికిడి వ్యవస్థలు, సాధారణారోగ్యంపై తీవ్ర ప్రమాదకర ప్రభావాన్ని చూపుతోంది. పెళ్లిల్లు, జాతరలు, పూజలు, శుభ, అశుభ సామాజిక, మతపరమైన కార్యక్రమాల్లో అధిక శబ్దాలను వెదజల్లే డిజె మోతలతో మానవ, జంతు ఆరోగ్యాలపై సత్వరమే దుష్ప్రభావం కలుగుతోంది. డీ.ఏ మోతలను భరించలేక వెంటనే కుప్పకూలిపోయి ప్రాణాలను కోల్పోయిన సందర్భాలను అనేకంగా చూస్తున్నాం.

గర్భిణులపై తీవ్ర ప్రభావం

శబ్ద కాలుష్యం గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. గర్భధారణ తర్వాత 15 నుంచి 60 రోజులు వ్యవధిలో పిండంలో అంతర్గత అవయవాలు, కేంద్రనాడీ వ్యవస్థ ఏర్పడతాయి. ఇలాంటి సమయాల్లో గర్భిణులు 55 డెసిబుల్స్ కంటే ఎక్కువగా శబ్దాన్ని వింటే అంతర్గత అవయవాల ఏర్పాటు, కేంద్ర నాడీ వ్యవస్థలో లోపాలు తలెత్తే అవకాశం ఉంది. తల్లి ఎక్కువ శబ్ద కాలుష్యానికి గురైతే తల్లి రక్తనాళాలు సంకోచించి పిండానికి రక్త ప్రసరణ తగ్గుతుంది. పిండం ఎదుగుదల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ గర్భిణులు 55 డెసిబుల్స్ కంటే అధికంగా శబ్దం ఉండే ప్రదేశాలకు వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వివిధ ఊరేగింపుల్లో వాడుతున్న డీజేలు 100 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని సృష్టిస్తున్నాయి. ఈ డిజె శబ్దాల వల్ల కొంతమంది గుండెపోటుకు గురై మృతి చెందిన సందర్భాలూ లేకపోలేదు.

ఆందోళన చెందుతున్న ప్రజలు

డిజెలు, లౌడ్ స్పీకర్లపై నిషేధం ఉన్నా అమలు చేయడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. వీటిని ఎక్కువగా పెళ్లిళ్ల, సామూహిక ఉత్సవాలు, వినాయకచవితి, దసరా ఉత్సవాలు ఎక్కువగా వాడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని నాయకుల నుంచి ఒత్తిళ్ల రావడంతో పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక చందాలతో నిర్వహించే సామూహిక కార్యక్రమాలకు డిజెలకు, టపాసులకు ఎక్కువ ఖర్చు పెడుతుండటం ఆందోళన కలిగించే అంశం. ప్రధాన రోడ్లపై అధిక శబ్దాన్నిచ్చే టపాసులు కాల్చడం పరిపాటిగా మారింది. అనుమతులు లేకున్నా పల్లె నుంచి పట్నం దాకా అన్నిచోట్ల డిజెలు, టపాసుల వాడకం పెరుగుతోంది. వీటిని నియంత్రించలేక పోలీసులు చేతులెత్తేస్తున్నారని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఉచిత ఇసుక పాలసీ అమలుకు చర్యలు

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - రావులపాలెం


ఊబలంక ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలుచేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శనివారం రావులపాలెం మండల పరిధిలోని ఊబలంక ఇసుక రీచును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నీరు తగ్గిన వెంటనే ఇసుక తవ్వకాలకు చర్యలు చేపడుతూ పార దర్శకంగా ఉచిత ఇసుక పాలసీని అమలు చేయా లని ఆదేశాలు సూచనలు జారీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ ఇసుక లభ్యత, వాహనాలు సరఫరా ఆన్లైన్ ఆఫ్లైన్ విధానంలో ఇసుక బుకింగ్ వాహనాల బుకింగ్ ప్రక్రియలపై ఇసుక రీచ్ నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అన్ని అంశాలపై పూర్తిగా అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ప్రక్రియలో ఎటువంటి అపోహలకు తావు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనన్నారు. ఇసుక రీచ్ సరిహద్దులను మ్యాపులు ఆధారంగా ఆయన గుర్తించి ఇసుక ర్యాంపు నిర్వహణపై తగు సూచనలు సలహాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీకర్, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి అశోక్ కుమార్, తహశీల్దార్ బిఎమ్. ముక్తేశ్వరరావు, ఆర్ఐ పి.సుజాత, ఇతర సిబ్బంది హాజరయ్యారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు


కలవచర్లలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహశీల్దార్ ప్రకాష్ బాబు

రైతులు తమ భూ సమస్యలపై గ్రామ రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు అన్నారు. మండలంలోని కలవచర్ల పంచాయతీ వద్ద సర్పంచ్ వడ్డీ వెంకన్న బాబు అధ్యక్షతన తహశీల్దార్ ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో సిబ్బందితో గ్రామ రెవెన్యూ సభ శనివారం నిర్వహించారు. ఇందులో సుమారు 20 మంది రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు దరఖాస్తుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఐదు రకాలుగా ఉన్నాయన్నారు. అవి జాయింట్ ఫీల్డ్ విభజన, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్, విస్తీర్ణం నందు వ్యత్యాసం, సర్వేనెంబర్ కొర్లేషన్ సవరణగా ఉన్నాయి. వీటి కొరకు ఫిర్యాదుదారులు దరఖాస్తుల రూపంలో అందజేయగా స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఐ రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి వి.వేణు, గ్రామ విఆర్ఒలు, సర్వేయర్లు, పాల్గొన్నారు.


కాలేరులో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహశీల్దార్ చిన్నారావు

కపిలేశ్వరపురం: భూ సమస్యలపై గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.చిన్నారావు అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండలంలోని కాలేరు పంచాయతీ వద్ద సర్పంచ్ దాయం కావేరి శేఖర్ బాబు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో తహశీల్దార్ చిన్నారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు కార్యక్రమం ఎంపిటిసి సభ్యురాలు టి.మంజుల, కూటమి నాయకులు చుండ్రు రామకష్ణ చౌదరి, పెయ్యల యాకోబు, కార్యదర్శి యు సుప్రియ, వీఆర్వోలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు

గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ


లొల్ల గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. శనివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామలో ప్రజాప్రతినిధులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

ఆత్రేయపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం ధ్యేయమని కొత్తపేట నియోజకవర్గ ఎంఎల్ఎ బండారు సత్యానంద రావు అన్నారు. ఆయన శనివారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మెర్లపాలెం గ్రామం సచివాలయం వద్ద రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు, డ్రెయిన్, లొల్ల గ్రామం మెయిన్ రోడ్ సిండికేట్ బ్యాంకు వద్ద రూ.14.20లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు, డ్రెయిన్ పేరవరం గ్రామం సచివాలయం వద్ద రూ.26 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, డ్రెయిన్, బొబ్బర్లంక గ్రామం ఎస్‌సి ఏరియా నందు రూ.25లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు మరియు డ్రెయిన్ నార్కెడిమిల్లి గ్రామంలో పాత పంచాయతి వద్ద రూ.22 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, డ్రెయిన్, అంకంపాలెం గ్రామం రజకపేట మరియు పాటిచెరువు వద్ద రూ.26 లక్షల తో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు, డ్రెయిన్ కు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో లొల్ల, మెర్లపాలెం సర్పంచులు కాయల జగన్నాథం, మెర్ల శ్రీరామచంద్రమూర్తి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** పల్లె పండుగ గ్రామ పంచాయతీ వారోత్సవాలతో గ్రామాల్లో అభివృద్ధి చెందుతున్నాయని అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. శనివారం అమలాపురం మండలంలోని ఇమ్మిడివరప్పాడు, రోళ్ళపాలెం, తాండవపల్లి, చిందాడగరువు, కామనగరువు, రెడ్డిపల్లి గ్రామాల్లో ఎంఎల్ఎ ఆనందరావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తో కలిసి ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.73 లక్షలతో నిర్మించే 7 సిసి రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమలో అమలాపురం ఎంఎల్ఎ ఆనందరావు


పేదలకు బియ్యం, దుప్పట్లను అందజేస్తున్న సత్తిరాజు కుటుంబసభ్యులు

సత్తిరాజు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం అన్నదాన సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత చిక్కం సత్తిరాజు (సత్రరాజు) సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. సత్తిరాజు వర్ధంతి సందర్భంగా శనివారం గొల్లవిల్లి సిఎస్ఎం జూనియర్ ఎంఎస్ఎస్ డిగ్రీ కళాశాలల ఆవరణలో గల సత్తిరాజు విగ్రహానికి ఈ సందర్భంగా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే సత్తిరాజు వర్ధంతి సందర్భంగా కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిక్కం వీర వెంకట సత్య వర ప్రసాదరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 200 మంది నిరుపేదలకు బియ్యం, దుప్పట్లను ఆయన కుటుంబీకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల జాయింట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పొత్తూరి వెంకటపతిరాజు, ప్రిన్సిపల్ కంచుమర్తి బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ టిడి.ఈశ్వరరావు, సత్తిరాజు కుటుంబీకులు కళాశాలల పాలకవర్గ సభ్యులు చిక్కం గోపాలకష్ణ, పద్మనాభం, బాల సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ మూర్తి, సత్తిరాజు, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో సాంకేతిక అవగాహన

ప్రజాశక్తి - రావులపాలెం

విద్యార్థుల మేథాశక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఆర్ట్స్, క్రాఫ్ట్ ఎంతగానో దోహదపడతాయని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక సెయింట్ పాట్రిక్స్ అకాడమీలో శనివారం జరిగిన ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ సత్యానందరావు హాజరయ్యారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆర్ట్స్, క్రాఫ్ట్, సైన్స్ వంటి ఎగ్జిబిషన్ కార్యక్రమాలు నిర్వహించడం మూలంగా విద్యార్థులకు మేధాశక్తి పెరుగుతుం దన్నారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాలు ఎమ్మెల్యే సందర్శించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి. శ్రీనివాసరాజు, సెయింట్ పాట్రిక్స్ అకాడమీ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

జాబ్ కార్డుదారులకు వంద రోజుల పని కల్పించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజులు పని దినాలు కల్పించాలని గ్రామ సర్పంచులు కోరిపెల్ల వెంకట నాగ స్రవంతి, వాసంశెట్టి సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని వాకతిప్ప, నాగుల చెరువు, గ్రామపంచాయతీల కార్యాలయాల వద్ద గ్రామ సర్పంచులు అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామ సభలో వారు మాట్లాడారు .ఈ సందర్భంగా ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ రవి కిరణ్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరం సంబంధించి గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనుల ప్రణాళికను గ్రామ సభల్లో చదివి వినిపించారు. గ్రామ పరిధిలో చేపట్టబోయే పంట కాలువలు, బోదెలు,చెరువులు, మట్టి రోడ్లు, హౌసింగ్, సంబంధించి వాకతిప్పలో రూ.60లక్షల అంచనాతో 53 పనులు, నాగుల చెరువులో రూ.32 లక్షల అంచనా తో 40 పనులు గుర్తించినట్లు ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లు టి.గణేష్ తెలిపారు .ఈ పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనన్నట్లు ఎపిఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు కొరిపెల్ల వెంకట నాగ స్రవంతి, వాసంశెట్టి సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులు వెంకటేశులు, టెక్నికల్ అసిస్టెంట్లు లోవరాజు, ఉపాధికూలీలు, రైతులు తదితరులు, పాల్గొన్నారు.



వాకతిప్ప ఉపాధి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎపిఒ రవి కిరణ్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అయినవిల్లి

బాధిత కుటుంబానికి రాజమహేంద్రవరానికి చెందిన టిడిపి రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కమిటీ అధ్యక్షులు కుడుపూడి సత్తిబాబు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని విలస గ్రామం ప్రకాశం వారి పాలెంలో బొక్కా వెంకటేశ్వరావు కుమారుడు హేమంత్ ఇటీవల జరిగిన ప్రమాదంలో చేతికి గాయమైంది. దీంతో అతనికి శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు కుడు పూడి సత్తిబాబు దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.12 వేలు సాయం, పండ్లు అందజేశారు. రాబోయే రోజుల్లో పార్టీ పరంగా సాయం అందేలా చూస్తామని కుడుపూడి సత్తిబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా శెట్టిబలిజ సాధికార కమిటీ అధ్యక్షులు దాసరి వి వి సత్యనారాయణ, రాష్ట్ర ఎంబిసి సాధికార కమిటీ అధ్యక్షులు పెంద్ర రమేష్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కమిటీ సోషల్ మీడియా కన్వీనర్ కుడుపూడి దుర్గారావు, స్థానిక ఎంపిటిసి సభ్యులు కుప్పల ఈశ్వరీ రాంబాబు, విలస టిడిపి గ్రామశాఖ అధ్యక్షులు అక్కిశెట్టి దుర్గారావు, జనసేన గ్రామశాఖ అధ్యక్షులు గంధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - కొత్తపేట

వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న కోనసీమ జిల్లాలో కొబ్బరి, ఆక్వా విలువ ఆధారిత స్వయం ఉపాధి ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు స్థాపనకు ప్రాధాన్యతనిస్తూ ఆ దిశగా అధికారులు మరింతగా ఔత్సాహిక వేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కొత్తపేట ఆర్‌డిఒ కార్యాలయం నందు జాతీయ గ్రామీణ జీవనోపాదుల కమిటీ పర్యటనలో గుర్తించిన అం శాలు, ఉచిత ఇసుక పాలసీ పూర్తిస్థాయి సన్నద్ధత అంశాలపై సంబంధిత అధికా రులతో సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొబ్బరి, ఆక్వారంగ విలువ ఆధారిత ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల స్థాపనకు మరింత చొరవ చూపి స్థానిక ప్రజానీకానికి జీవనోపాదులు పెంపొందించాలని ఆదేశం చారు. వివిధ రకాల పథకాల ద్వారా యూనిట్లు గ్రౌండింగ్ కు రాయితీతో కూడిన రుణాల కల్పన ద్వారా ఈ ప్రాంత సామాజిక అభివృద్ధికి యితోదికంగా సహాయ పడాలన్నారు. జిల్లాలో చిన్న తరహా ఆహార పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అదే విధంగా వివిధ కేంద్ర రాష్ట్ర స్కీములు నేడు అందుబాటులో ఉన్నాయని వాటి ద్వారా జీవనోపాదుల పెంపుదలకు జిల్లా గ్రామీ ణాభివృద్ధి సంస్థ, పరిశ్రమల కేంద్రం , బ్యాంకర్లు పూర్తి సమన్వయం వహించాలని సూచించారు. ఇటీవల కొత్తపేట, కపిలేశ్వరపురం కాట్రేనికోన, కె.గంగవరం మండలాల్లోని 10 గ్రామ పంచాయతీలైన అవిడి, గంటి, మోడేకుర్రు, కోటిపల్లి, ఊడిమూడి, తాతపూడి, నేలటూరు, బంటుమిల్లి, చెయ్యరు, పేకేరుల్లో జాతీయ గ్రామీణ జీవనోపాదుల కమిటీ పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలు ద్వారా జీవనోపాదుల పెంపుదల అంశాలపై పర్యవేక్షించి ఒదన్నారు. స్వయం సహాయక సంఘాలు చేపట్టిన చిన్న తరహా పరిశ్రమలు జిల్లా నీటి యజమాన్య సంస్థ ద్వారా చేపడుతున్న నరేగా పనులు గృహ నిర్మాణాలను కమిటీ క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసిందని ఆయన తెలిపారు. స్వయం సహాయక సంఘాల వ్యక్తిగత కార్యకలాపాలు స్థాపన నిర్వహణ తీరును ఈ కమిటీ అభినందించిందని తెలిపిందన్నారు. సహాయక సంఘాలకు సంబంధించి బ్యాంకులలో పొదుపు చేసిన నిధులు విత్ డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సంఘాలు కోరుతున్నట్లు కమిటీ సభ్యులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారు లతో ఇసుక రీచ్‌ల్లో పూర్తిగా నీరు తగ్గిన పిమ్మట ఇసుక తవ్వకాలకు సిద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. భవన నిర్మాణ రంగాల డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ లోపుగా వాహనాలు ఏర్పాటు మానవ వనరులు, మ్యాప్‌ల రూపకల్పన, అప్రోచ్ రోడ్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని విధాలుగా ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు కు సిద్ధపడాలని ఆదేశం చారు. ఈ కార్యక్ర మంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్‌డిఒ పి.శ్రీకర్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పలు అంశాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్


లారీ యూనియన్ ఆధ్వర్యంలో రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళులు

రతన్‌టాటా మరణం తీరని లోటు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్ సంస్థల అధిపతి రతన్ టాటా మరణం రవాణా కార్మికులకు తీరని లోటని రామచంద్రపురం లారీ యూనియన్ పేర్కొంది. శనివారం లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గన్నమని చక్రవర్తి ఆధ్వర్యంలో యూనియన్ రతన్‌తాతా మరణానికి సంతాపం తెలియజేసి నివాళులు అర్పించింది. చక్రవర్తి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు రంగం పితామహుడు, ఇండస్ట్రియలిస్ట్, దేశంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆదుకునే గొప్ప మనసున్న దానశీలి, ఎంతోమంది నిరుద్యోగులు పాలిట పేదల నోవెల్ రతన్ టాటా మరణం దేశానికి, కార్మికులకు తీరని లోటని అన్నారు. రతన్ టాటా జీవితం ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రతన్ టాటా 1991-2012 టాటా గ్రూప్‌కు ఛైర్మన్‌గా పనిచేశారన్నారన్నారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లైంగిక వేధింపుల కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - కాట్రేనికోన

బాలికను లైంగికంగా వేధించిన వివాహితుడిపై శనివారం కేసు నమోదు చేసిన పోలీసులు అతనిని రిమాండుకు తరలించారు. వివరాలు ఇవి.. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని జిల్లెళ్లవారి పేటలో వివాహితుడు వాకపల్లి ఏసు బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తన తల్లిదండ్రులు సహాయంతో కాట్రేనికోన పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. వివాహితుడు ఏసుపై పోలీసులు శనివారం పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం ఆతనిని కోర్టుకు తరలించగా, కోర్టు నిందితునికి రిమాండ్ విధించింది. పోలీసులు నిందితుడిని సబ్ జైలుకు తరలించారు.

నలుగురు పోలీసుల సస్పెన్షన్

ప్రజాశక్తి - పెరవలి

రికవరీ సొమ్ములో చేతివాటం ప్రదర్శించిన సిఐ, ఎస్ఐ, రైటర్, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నిడదవోలు సర్కిల్ పెరవలి పోలీస్ స్టేషన్ పరిధిలో అన్నవరప్పాడు పరిసర ప్రాంతంలో పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సెప్టెంబర్ 9న పేకాటి శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురునిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసులో మాత్రం రూ.55 వేలు మాత్రమే దొరికినట్టు చూపారు. విషయం ఎస్‌పి నరసింహ కిషోర్ దృష్టికి వెళ్లింది. ఈ మేరకు ఉన్నతాధికారులు రహస్య విచారణ చేపట్టారు. ఖాకీల చేతివాటం రుజువు కావడంతో నలుగురుపై సస్పెన్షన్ వేటుకు ఆదేశాలు జారీ చేశారు.

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి బాడవ హై స్కూల్ సమీపంలో 216వ జాతీయ రహదారిలో లారీని వ్యాన్ ఢీ కొట్టిన సంఘటనలో నలుగురుకి గాయాలయ్యాయి అమలాపురం వైపు వెళుతున్న ఊక లారీని మామిడికుదురు వైపు వస్తున్న వ్యాన్ ఢీ కొట్టి తిరగబడింది. శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో వ్యానులో ఉన్న డ్రైవర్, క్లీనర్లతో పాటు, లారీ డ్రైవర్, క్లీనర్ కు స్వల్ప గాయాలయ్యాయి చికిత్స నిమిత్తం వారిని అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

పాము కాటుతో విద్యార్థిని మరణం

ప్రజాశక్తి -కరప

కరప మండలం సిరిపురం గ్రామానికి చెందిన రెండవ తరగతి విద్యార్థిని పాముకాటుకు గురై మతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. పూలపల్లి నాగరాజు కుమార్తె పూలపల్లి ఉషశ్రీ (8) ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. పాఠశాలలో ఉదయం 7.30 గంటలకు జ్వరం రావడంతో వెంటనే 108లో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా వైద్యులు విద్యార్థిని పరీక్షించి ఎడమ కాలుపై పాము కాటు వేసిందన అనుమానించి వైద్యులు చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

కొబ్బరి చెట్టు మీద నుండి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కరప పోలీసులు తెలిపారు. ఈ నెల 10వ తేదీన రామచంద్రపురం మండలం కాపవరం గ్రామానికి చెందిన కొబ్బరికాయలు దింపు కార్మికుడు కరప మండలం వడ్డీపాలెం గ్రామంలోని కొబ్బరి చెట్టుపై నుంచికాయలు దింపుతుండగా ప్రమాదవశాస్తూ కింద పడిపోయాడు. అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ తరలించగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-కాజులూరు

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో గొల్లపాలెం పోలీసులు పాల్గొన్నారు.

భాష్యంలో వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్ డే

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట భాష్యం పాఠశాలలో శని వారం వరల్డ్ ఫుడ్ డే ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రకరకాల పిండివంటలు, స్వీట్స్, ఫ్రూట్స్ తీసుకుని వచ్చి ప్రదర్శించారు మాస్టర్ చెఫ్ వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సూర్య, శిరీష, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌ఛార్జి వి.గోవిందరాజు విద్యార్థులను అభినందించారు.

చోరీలు, ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

దొంగతనాలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టితో ముందుకెళుతున్నట్టు సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో రాత్రి సమయంలో పలుచోట్ల దొంగతనాలు జరుగుతున్నట్లు వస్తున్న సమాచారం పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండా లన్నారు. అనుమానితులపై వెంటనే 100 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. విలువైన ఆభరణాలు గహాల్లో ఉంచుకోకుండా జాగ్రత్త పడాలన్నారు.

చిత్ర లేఖనంలో స్వాతి ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లా స్థాయిలో పిఎంశ్రీ స్కూల్స్ నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎం.స్వాతి లక్ష్మి ద్వితీయ స్థానం సాధించినట్టు హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం ఎపిఎస్‌పి జెడ్‌పి హైస్కూల్లో ఎంఇఒ ఎం.రామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ టీచర్ ఆర్.శివకుమార్, విద్యార్థిని హెచ్ఎం రామకృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, ఎంఇఒలు వై శివ రామ కష్ణయ్య, పి.పుల్లయ్య, కమిషనర్ శ్రీవిద్య అభినందించారు.

హామీలు సరే... ఆచరణ ఏదీ..?

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఆచరణలో మరిచింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉచిత ఇసుక విధానమే దీనికి నిదర్శనం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఉచితం హామీ నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. అప్పోసప్పో చేసి ఇసుకను కొనుగోలు చేద్దామన్నా ఇసుక రేణువులు కూడా దొరకని పరిస్థితి. నిర్మాణ పనులను ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భవన నిర్మాణ రంగంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఎ దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన 26 రంగాల కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. పనుల్లేక పస్తులుంటున్నారు. అ నెల 16 నుంచి ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుందని కలెక్టర్ స్వయంగా ప్రకటరించారు. జిల్లాకు 14 వరకూ ఓపెన్ రీచ్‌లు కేటాయించామని తెలిపారు. సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలంటూ చెప్పుకొచ్చారు. ఇదంతా భాగానే ఉన్నా... ప్రకటన వెలువడి నాలుగు రోజులైనా నేటికీ ఇసుక దొరకని పరిస్థితి. ఆన్‌లైన్‌లో బుకింగ చేసుకోవడం పెద్ద ప్రహసనంగా మారింది. సాంకేతిక కారణాల ఫలితంగా రోజుల తరబడి కొనుగోలు దారులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఆఫ్‌లైన్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడక్కడా ఒకటిరెండు ఎడ్లబళ్లు, ఒకటి రెండు ట్రాక్టర్ల ఇసుక తప్ప ఎక్కడా పూర్తిస్థాయిలో ఇసుక దొరకని పరిస్థితి. ఉచితం మాట ఎలా ఉన్నా కనీసం ఇసుకైనా ఇప్పించి ఉపాధి చూపండంటూ భవన నిర్మాణ రంగ కార్మికులు వేడుకుంటున్నారు.

ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికులు నానా ఇబ్బందులు పడుతుంతే నూతన మద్యం పాలసీ పుణ్యమా అని ఎక్కడికక్కడ మద్యం మాత్రం ఏరులై పారుతోంది. నూతన మద్యం పాలసీతో గుడి, బడి ఇలాంటివేమీ పట్టించుకోకుండా మద్యం దుకాణాలు వెలశాయి. ఇళ్ల మధ్య దుకాణాలు తొలగించాలని మహిళలు రోడ్డెక్కుతున్నా... సర్కారులో మాత్రం ఎలాంటి చలనం లేదు. మద్యంపై ఆదాయమే పరమావధిగా సర్కారు తీరు ఉండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కొత్త దుకాణాల్లో పాత మద్యాన్నే పాత ధరలకే అమ్మడంపై మందుబాబులు సైతం పెదవి విరుస్తున్నారు. 2024 ఎన్నికల్లో 'నాణ్యమైన మద్యం సరసమైన ధర' అంటూ నిస్సిగ్గుగా హామీ ఇచ్చిన కూటమి అనుకున్నట్టే ఆఘమేఘాలపై టెండర్లను ప్రక్రియను పూర్తిచేసి ప్రయివేటు మద్యం షాపులకు అనుమతులు ఇచ్చేసింది. టెండర్లు, లాటరీ, షాపుల ఏర్పాటు చక చకా జరిగిపోయాయి. అయితే అడుగడుగునా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో మద్యం సిండికేట్ చక్రం తిప్పిందనేది బహిరంగ రహస్యమే. అయితే గతంలో విక్రయించిన ధరలూ, అవే బ్రాండ్లు ఉండటంతో మందుబాబులు సైతం విస్తుపోతున్నారు.

మరో పక్క ఉమ్మడి జిల్లాను వరుణుడు వీడట్లేదు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు వడివడిగా ప్రారంభం అవుతున్నాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో ఒక వాయుగుండం రెండు రోజుల క్రితం తీరం దాటింది. ఈ సమయంలో కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల ధాన్యం తడిసిపోయింది. తరువాత రెండు రోజుల పాటు ఎండలు కాడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. ఇదే సమయంలో వాతావరణ శాఖ మరో వాయుగుండం హెచ్చరికలు చేయడంతో రైతుల్లో మళ్లీ ఆందోళన నెలకొంది. ఈ నెల రెండో వారం నుంచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొనుగోళ్లు మాత్రం అనుకున్న రీతిలో జరగట్లేదు. నిబంధనలు, దళారుల రాకతో అన్నదాతలు విస్తుపోతున్నారు. చేసేది లేక కొంత మంది అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు సమాయత్తం

ఎంఎల్‌సి ఎన్నికలకు ఉభయగోదావరి జిల్లాల్లో రాజకీయ పార్టీలు సంసిద్ధమవుతున్నాయి. ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలతో పాటు పలు ప్రజా సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపిన చరిత్ర పిడిఎఫ్ ఎంఎల్‌సిల సొంతం. తాజాగా ఉపాధ్యాయ ఉద్యమాల్లో కీలకంగా పనిచేసిన గోపిమూర్తి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలో నిలిచారు. మండలిలో తమ గళం వినిపించేందుకు గోపిమూర్తిని గెలిపించుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు నడుంబిగించాయి. ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతం చేస్తున్నాయి. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం కూడా ఉపాధ్యాయ సంఘాలు సూచించిన వ్యక్తిని బలపర్చేందుకు పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ఇటీవల రాజమహేంద్రవరంలో మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర కీలక నాయకుల ఆధ్వర్యంలో సమావేశాన్ని సైతం నిర్వహించింది. కోనసీమకు చెందిన అభ్యర్థిని బరిలో ఉంచాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. దాదాపుగా ఖరారైన అధినేత ప్రకటన కోసం అందరూ వేచి చూస్తున్నారు.



గొడౌన్‌లోని ఇవిఎంల వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఇవిఎం), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైయల్ (వివిప్యాట్ల) గొడౌనల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఎన్నికల రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల సముదాయం మూడో అంతస్తులో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వివి ప్యాట్లను భద్రపరిచిన గొడౌన్‌ను కలెక్టర్, రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం గోదామును తనీఖి చేసి ఇవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి తీసుకున్న చర్యలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు నెలవారీ తనిఖీలో భాగంగా ఇవిఎం, వివిప్యాట్ గొడౌన్‌ను తనిఖీ చేశామన్నారు. అలాగే ప్రతి త్రై మాసానికి ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, స్థానిక తహశీల్దార్ ఎంవి.సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ శివ రాజు ఆర్ఐ రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్లేస్కూల్ విధానంలో బోధిస్తున్న టీచర్ కుసుమ

కాల్దారి పాఠశాలలో నో బ్యాగ్ డే

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా బోధనోపకరణాలతో విద్యార్థులకు ఆటలను నేర్పిస్తున్నట్లు ఉపాధ్యాయిని కుసుమ తెలిపారు. మండలంలోని కాల్దారి నెంబర్-3 పాఠశాలలో ఆమె ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. పనికిరాని అట్ట ముక్కలతో పిన్ బాల్, బాస్కెట్ బాల్, దారి తెలుసుకొండి వంటి ఇండోర్ ఆటలను ఆడుకునేందుకు స్వయంగా ఉపకరణాలను ఆమె తయారు చేశారు. పిల్లలు పాఠశాలకు ఆకర్షితులయ్యేలా ఆటపాటలతో ఉత్తేజ పరుస్తున్నట్లు తెలిపారు. బోధనోపకరణ సామగ్రి, బోధనను ఆకర్షనీయంగా చేసే సాధనం అని కుసుమ అన్నారు. అభ్యాసన ప్రక్రియ పట్ల విద్యార్తులకు ఆసక్తి కలిగించే విధంగా పాఠ్య బోధనను కొనసాగిస్తున్న ఆమెను హెచ్ఎం సుభద్రకుమారి, తోటి ఉపాధ్యాయులు కట్టా హేమలత, శివప్రసాద్, తదితరులు భినందించారు.

యానాం వార్తలు

అధికారులతో మల్లాడి సమావేశం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ సమస్యలు, అభివద్ధి పనులపై స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి సమక్షంలో వివిధ శాఖల అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో స్మార్ట్ స్కూల్ ప్రతిపాదన మేరకు ఈ నెల 4వ తేదీన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏడు స్కూల్స్ ఎంపిక కాగా ప్రతి హైస్కూల్లో ఐదు స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సిఎస్ఆర్ నిధులలో చేపట్టే అభివృద్ధి పనులకు బుధవారం నాటికి టెండర్లకు పిలవాలన్నారు. సాయి స్పోర్ట్స్ హాస్టల్, మెట్టకూరు గ్రామ డెవలప్మెంట్, అయ్యన్న నగర్ బ్రిడ్జింగ్ వర్క్, ఇందిరాగాంధీ మార్కెట్లో అభివద్ధి పనులు, తదితరవాటికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీ, పిడబ్ల్యుడి శాఖల్లో పెండింగ్లో ఉన్న పనులను మొదలు పెట్టాలని, దానికి సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు. ఆంధ్రాలో సరిహద్దు ప్రాంతంలో ఉన్న పందులంక భూమి యానంకు చెందినదని కోర్టు తీర్పు ఇచ్చిందని ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్ శాఖ,రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారులు చూసుకోవాలన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని ఆందోళన

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట ఏటిగట్టు రోడ్డులోని డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని కనకాల పేట గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా డంపింగ్ యార్డును తరలించాలని ముక్తకంఠంతో ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని కోన సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజలు, విద్యార్థులు రోడ్డుపై రాకపోకలు సాగించడానకి దుర్గంధం వల్ల అవస్థలు పడుతున్నారన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలో గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌పి రాజశేఖరన్ తెలిపారు. స్థానిక రీజెన్సీ స్కూల్‌కు వెళ్లే పరిసర ప్రాంతంలో నలుగురు యువకులు గంజాయిని విక్రయిస్తుండగా క్రైమ్ టీమ్ దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. యానాం ఫెర్రీరోడ్డుకు చెందిన సంగాడి మహేష్ బాబు, తాళ్లరేవు మండలం సీతారామపురానికి చెందిన గెడ్డం రాజు, అయ్యన్ననగర్‌కు చెందిన పెసింగి నాని, పెనుపోతు విజయదుర్గావరప్రసాద్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 500 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నింది తులను యానాం సబ్ కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఈ సమావేశంలో సిఐ షణ్ముగం, ఎస్సై మురుగునందమ్ పాల్గొన్నారు.

జనసేన నాయకుడు నాగరాజు మృతి

ప్రజాశక్తి - పెరవలి



మండలంలో కానూరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు నాగరాజు గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన ఉన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు నాగరాజు మరణ వార్త తెలియగానే పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కానూరు చేరుకొని నాగరాజుకు నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు నాగరాజు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవి, నాయకులు పాల వీరాస్వామి, సంగీత నాగు, పోలిరెడ్డి రాంబాబు, కాకర్ల నాని వాకలపూడి వీర్రాజు, ముళ్ళపూడి రాజు, కొమ్మిశెట్టి రామకష్ణ, రంకిరెడ్డి ప్రసాద్ తదితరులున్నారు.

రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - రామచంద్రపురం



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

హసన్‌బాద గ్రామంలో ఉపాధి హామీ చట్టం నిధులతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో రూ.3.లక్షల సిమెంటు రోడ్డు పనులకు శంకు స్థాపన చేశారు. హసన్‌బాద ఎంపిటిసి సభ్యుడు యన్నందేవి, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు చింతపల్లి వీరభద్రరావు, రామచంద్రపురం ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, పంచాయతీ రాజ్ ఎఇ ఏసురత్నం మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు కూటమి నాయకులు,ప్రజా ప్రతినిధులు, ఉప సర్పంచ్ నీలం భవాని, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సూర్యప్రకాష్ పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం




పరామర్శిస్తున్న పిల్లి సూర్యప్రకాష్,ఎంపిపి తదితరులు

ఇటీవల కోటిపల్లి గోదావరిలో గల్లంతై మరణించిన రాయిచెరువు గ్రామ యువకులు నరాల వేద మూర్తి, మేడిసెట్టి వీరబ్రహ్మం కుటుంబాలను నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ శనివారం పరామర్శిం చారు. ఈ సందర్భంగా సంఘటన వివరాలు తెలుసు కొని ఆయన సంతాపం తెలిపారు. తాము ఎప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా వివరించారు. పిల్లి సూర్యప్రకాష్ వెంట రామచంద్రపురం మండల అధ్యక్షులు అంబటి భవాని, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ పి.సూర్య ప్రకాష్, గ్రామ నాయకులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన ఐజి

ప్రజాశక్తి- కడియం

కడియం పల్ల వెంకన్న నర్సరీని ఐజి రవిప్రకాష్ శనివారం సందర్శించారు. నర్సరీ ఎంతో ఆహ్లాదంగా, అద్భుతంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నర్సరీ చైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, మేనేజింగ్ డైరెక్టర్ పల్ల వినయ్ వారికి స్వాగతం పలికారు. పచ్చని మొక్కలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, వృత్తిపరమైన ఒత్తిళ్లను అధిగమించడానికి ఇటువంటి నందనవనాల సందర్శనలు ఉపకరిస్తాయన్నారు. దేశ విదేశీ జాతి మొక్కలతో పల్ల వెంకన్న నర్సరీ వర్ణ వైవిధ్యాన్ని కల్పిస్తుందన్నారు. పాత తరం నుంచి నేటి అధునాతన రకాల మొక్కలు ఒకేచోట కనువిందు చేస్తున్నాయని రవి ప్రకాష్ కితాబిచ్చారు. ఆయన వెంట పలువురు జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



ఐజికి పూలమొక్కతో స్వాగతం పలుకుతున్న నర్సరీ యజమానులు

కిటకిటలాడిన వాడపల్లి

ప్రజాశక్తి - ఆత్రేయపురం



జిల్లా జెసికి స్వామి వారిచిత్రపటం అందజేస్తున్న ఆలయ డిసి

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిటకిటలాడింది. ఉదయాన్నే స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి యాత్రికులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్ల చక్రధర్ రావు ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. రాత్రి 9 గంటల వరకు భక్తులు రద్దీ కొనసాగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.నిషాంతి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు.

బాల బాలాజీ ఆలయానికి రూ.1.51 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి పలు సేవల ద్వారా రూ.1,51,984లు ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. దర్శనం లడ్డు ప్రసాదం తదితర విక్రయాల ద్వారా రూ.1,01,215లు ఆదాయం రాగా నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.50,769లు విరాళాలుగా సమర్పించారన్నారు 2,900 మంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకోగా 1,876 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

మందేశ్వరస్వామి ఆదాయం రూ.1.55 లక్షలు

కొత్తపేట: మండలంలో మందపల్లి గ్రామంలో వేంచేసియున్న మందేశ్వర స్వామి దేవస్థానం నందు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు స్వామివారికి శనివారం తైలాభిషేకములు ద్వారా రూ.1,26,635 అన్న ప్రసాదం విరాళాలుగా రూ.28,500 మొత్తం వెరసి రూ.1,55,135 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జాన్ లింకన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ఆధార్ స్పెషల్ డ్రైవ్ క్యాంపులను మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం ఈనెల 22న పినపళ్ల, పెనికేరు, మూలస్థానం, 23న చింతలూరు, సంధిపూడి, చొప్పెల్ల, 24న మోదుగూరు, ఆలమూరు, చెముడులంక, 25న గుమ్మిలేరు, ఆలమూరు, బడుగువానిలంక గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు. అయితే ఆధార్ కార్డు పొంది 10 ఏళ్ల దాటి ఇప్పటివరకు ఒక్కసారి ఆధార్ అప్డేట్ చేయించుకోని వారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొడగట్లపల్లిలో వంట శాల ప్రారంభం

ప్రజాశక్తి - రావులపాలెం

అన్న క్యాంటీ న్లకు అవసరమైన భోజనం, అల్పాహారం తయారు చేయడానికి రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నక్షేత్ర వంట శాలను శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు లక్షల మంది ప్రజలకు ఆహారాన్ని తయారు చేసి అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్‌డిఒ పి శ్రీకర్, తహశీల్దార్ ముక్తేశ్వరరావు, నిష్కన్ సన్ భక్త దాస, వైకుంఠేశ్వర దాస, సుఖి సాగర దాస, శ్యామ్ మాధవ దాస, స్థల దాత మంగిపూడి కృష్ణశాస్త్రి అండ్ సీతమ్మ ట్రస్ట్ చైర్మన్ మంగిపూడి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-కాజులూరు, కరప

గ్రామ సభల ద్వారా రీ సర్వేలో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామని కాజులూ తహశీల్దారు ఎల్.శివకుమార్ తెలిపారు. శనివారం మండలంలోని జగన్నాథగిరిలో గతంలో నిర్వహించిన డ్రోన్ సర్వే వివరాలు తెలుసుకున్నట్టు తెలిపారు. ఈ గ్రామసభలో ఆర్ఐ వేగేశ్వరరావు, విఆర్ఒ ఈశ్వరరావు, సర్పంచ్ కొరాని అచ్యుతాంబ, కొప్పన లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరప మండలంలో నిర్వహించిన సభలో పలు ఫిర్యాదులు అందినట్టు తహశీల్దారు ఎన్.సత్యనారాయణ తెలిపారు. సభలో తొమ్మిది ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసుబాబు, జనసేన నాయకులు బండారు లక్ష్మణ్ ప్రసాద్, విఆర్ఒ ఎం.కిషోర్ పాల్గొన్నారు.